నమస్తే తెలంగాణ

నల్లగొండ

5 నల్లగొండ, ఆదివారం 24 నవంబర్ 2024 NALGONDA


## లక్ష్మీనర్సింహస్వామి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



యాదగిరిగుట్ట, నవంబర్ 23 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సృజన శనివారం కుటుంబ సమేతంగా దర్శించుకుని పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సంప్రదాయ రీతిలో స్వాగతం పలికి వేదాశీర్వచనం చేశారు. ఆమెకు ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

# రేషన్ కార్డులకు సన్న బియ్యం సున్నాయేనా?

## గోదాముల్లో బియ్యం లేవు.. ప్రభుత్వం సన్నాలు కొంటలే

- అటకెక్కనున్న కాంగ్రెస్ ప్రభుత్వ మరో హామీ..
- ఇప్పటికే అమలు కాని అనేక హామీలు



**ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయడంలేదు. ఇప్పటికే అనేక హామీలను విస్మరించిన ప్రభుత్వం.. పేదలకు నెలనెలా ఇచ్చే రేషన్‌కార్డుపై సన్న బియ్యం హామీ అటకెక్కిస్తారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సంక్రాంతి నుంచి సన్న బియ్యం ఇస్తామని ప్రకటించగా.. అందుకు భిన్నంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఉగాది నుంచి ఇస్తామని చెప్పిన విషయం విదితమే. ఎప్పుడు ఇద్దామనుకున్నా గోదాముల్లో సన్న బియ్యం స్టాక్ లేదు. ప్రస్తుత సీజన్‌కు సంబంధించి రైతుల నుంచి పెద్దగా సన్న వడ్లు కొనుగోలు చేయడం లేదు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇప్పటి వరకు సుమారు 5300 మెట్రిక్ టన్నులకు మించి కొనుగోలు చేయలేదు. ప్రైవేట్ మార్కెట్‌లోని సన్న బియ్యం కొనుగోలు చేసి ఇస్తుందనుకుంటే.. ఇప్పటికే ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా అమలు చేయకపోవడంతో ఆ ఆశలు కూడా సన్నగిల్లినట్లే.**

– సూర్యాపేట, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ)

### సన్న బియ్యం సున్నాయేనా?

కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా తుంగలో తొక్కతూ వస్తున్నది. తాజాగా మరో హామీ కూడా అమలయ్యే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికే రైతుబంధుకు రాంరాం చెప్పారు. రైతుల రుణమాఫీ సగం చేసి వదిలేశారు. పింఛన్ పెంపు పత్తా లేకుండాపోయింది. ఆడపడుచులకు స్కూటీ, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ స్కీమ్‌లకు తులం బంగారానికి ఎగనామం పెట్టారు. ఇచ్చిన 420 హామీల్లో ఏ ఒక్కటీ అమలుకు నోచుకోకపోగా ఒకటి రెండు అరకొర చేసి ఏదో చేశామని బాకాలు ఊదుతున్న కాంగ్రెస్ నాయకులు సన్న బియ్యంపై తలా ఒక మాట మాట్లాడడం ఆశ్చర్యానికి గురి చేస్తుంది.

### 8నెలల పాటు బీఆర్ఎస్ హయాంలోని బియ్యమే..

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాటి సీఎం కేసీఆర్ ముందు చూపుతో వ్యవహరించి సంక్షేమ పథకాలను తూ.చ. తప్పకుండా అమలు చేశారు. అంగన్‌వాడీలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, గురుకులాలు, హాస్టల్ విద్యార్థులకు సన్న బియ్యం అందించారు. దీనికోసం ఏడాది ముందే సన్న వడ్లు సేకరించి సిద్ధంగా ఉంచారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సేకరించిన సన్న బియ్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం జూలై వరకు విద్యార్థులకు పంపిణీ చేసింది. జూలై నుంచి ఇప్పటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న పురుగుల అన్నం, మక్కిన బియ్యంతో విద్యార్థులు అరిగోస పడుతున్నారు.


### బియ్యం లేవు.. సన్న వడ్లు కొంటలేరు

సంక్రాంతికో, ఉగాదికో పంపిణీ చేసేందుకు ప్రస్తుతం గోదాముల్లో సన్న బియ్యం లేవు. ప్రస్తుత సీజన్‌లో రైతులు పండించిన సన్న వడ్లను ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదు. నెలనెలా వేతనాలు, పింఛన్లు ఇచ్చేందుకే ఆపసోపాలు పడుతున్న ప్రభుత్వం మరి ఈ స్కీమ్‌కు సన్న బియ్యాన్ని ఎక్కడి నుంచి సేకరిస్తారనేది ప్రశ్నార్థకంగా కనిపిస్తుంది. వానకాలం సీజన్‌కు సంబంధించి వరి కోతలు దాదాపు 70 శాతానికి పైగా పూర్తయ్యాయి. రైతులు అత్యధికంగా సన్న రకం ధాన్యమే పండించారు. కానీ.. ప్రభుత్వం ఆర్భాటంగా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సన్న వడ్లు అంతంత మాత్రంగానే కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటి వరకు సూర్యాపేట జిల్లాలో 2,638, నల్లగొండ జిల్లాలో 2,513 మెట్రిక్ టన్నులు మొత్తం కలిపి సుమారు 5,300 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. వాస్తవానికి ఒక్క సూర్యాపేట జిల్లాలోని ఫుడ్ సెక్యూరిటీ, అంత్యోదయ, అన్నపూర్ణ కార్డులకు కలిపి 3,24,188 కార్డులు ఉండగా వాటికి నెలనెలా 5,946 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేయాల్సి ఉంటుంది. అంటే ఈ లెక్కన రెండు జిల్లాలు కలిపి ఇప్పటి వరకు 5,300 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం కొనుగోలు చేయగా.. చివరి వరకు సుమారు 20వేల మెట్రిక్ టన్నులకు మించి కొనుగోలు చేయడం గగనమే అని అధికారులు చెబుతున్నారు. మరో పక్క ప్రస్తుతం సన్న ధాన్యానికి గిరాకీ పెరుగుతుంది. హైదరాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాల నుంచి బయ్యర్లు వస్తుండడంతో రోజురోజుకు సన్న వడ్ల ధరలు పెరుగుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా కొనుగోలు సెంటర్ల నుంచి రైతులు పండించిన పంటలో 10 శాతం కూడా ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడం గమనార్హం. మరి రేషన్ కార్డులపై సన్న బియ్యం పంపిణీ చేయడానికి ఎక్కడి నుంచి తెస్తారు..? ఈ స్కీమను ఎలా అమలు చేస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలో ఈ పథకం కూడా అటకెక్కినట్లేనని పలువురు పేర్కొంటున్నారు.

# టీచర్స్ ఎమ్మెల్సీ ఓటర్లు 22,554

## ముసాయిదా ఓటర్ల జాబితా వెల్లడి

- వచ్చే నెల 9వరకు అభ్యంతరాల స్వీకరణ
- వచ్చే నెల 25న తుది జాబితా విడుదల



నల్లగొండ ప్రతినిధి, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ) : నల్లగొండ – ఖమ్మం – వరంగల్ శాసనమండలి ఉపాధ్యాయ నియోజవర్గానికి సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితా విడుదలైంది. మొత్తం 22,554 మంది ఓటర్లతో కూడిన ముసాయిదా జాబితాను నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు గత నెల ఆరంభం నుంచే ఓటర్ల నమోదుకు షెడ్యూల్‌ను విడుదల చేశారు. దీని ప్రకారం ఈ నెల 6వ తేదీ వరకు ఓటర్ల నమోదుకు అవకాశం కల్పించారు. దీంతో నియోజకవర్గం పరిధిలోని 12 జిల్లాల నుంచి ఓటు హక్కు కోసం మొత్తం 28,698 మంది ఉపాధ్యాయులు, అధ్యాపకులు దరఖాస్తు చేసుకున్నారు. స్క్రూట్నీలో 6,144 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. ఇవి పోగా 22,554 దరఖాస్తులు సక్రమంగా ఉండడంతో వారి పేర్లతో ముసాయిదా ఓటర్ల జాబితాను సిద్ధం చేశారు. ఇందులో పురుషులు 13,498 మంది, మహిళలు 9,056 మంది ఓటర్లుగా ఉన్నారు. ఈ జాబితాను శనివారం నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి విడుదల చేశారు. ఈ ముసాయిదా ఓటర్ల జాబితాను అన్ని తాసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచనున్నారు. ఈ జాబితాపై అభ్యంతరాల స్వీకరణకు వచ్చే నెల 9వ తేదీని తుది గడువుగా ప్రకటించారు. అభ్యంతరాలు, సవరణలను స్వీకరిస్తూనే కొత్త ఓట్ల కోసం దరఖాస్తులకు సైతం అనుమతిస్తున్నారు. వచ్చే నెల 9వ తేదీ అనంతరం వచ్చిన అభ్యంతరాలను, దరఖాస్తులను పరిశీలిస్తారు. దీని అనంతరం వచ్చే నెల 25వరకు తుది ఓటర్ల జాబితాను సిద్ధం చేస్తారు. దీని ఆధారంగానే వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించనున్నారు. ప్రస్తుతం ఈ స్థానం నుంచి టీఎస్‌యూటీఎఫ్‌కు చెందిన అలుగుబెల్లి నర్సిరెడ్డి ఎమ్మెల్సీగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయన పదవీకాలం వచ్చే ఏడాది మార్చితో ముగియనున్న నేపథ్యంలో ఓటర్ల నమోదు ప్రక్రియకు ఎన్నికల కమిషన్ తెరలేపింది. 2019 మార్చిలో జరిగిన గత ఎన్నికల్లో మొత్తం 20,888 మంది ఓటర్లు ఉండగా ఈ సారి ఓటర్ల సంఖ్య పెరగనుంది. ఇప్పటికే ముసాయిదా జాబితా ప్రకారం గతంతో పోలిస్తే అదనంగా 1,666 మంది పెరిగారు. తుది జాబితా ప్రకటించే నాటికి వీరి సంఖ్య మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. పోలింగ్ కేంద్రాల సంఖ్య గతంలో 181 ఉండగా, ఈ సారి 200కు పెరిగింది. అదనంగా 19 పోలింగ్ కేంద్రాలు కొత్తగా రానున్నాయి.

| జిల్లా | పోలింగ్ కేంద్రాలు | ఓటర్ల సంఖ్య |
|---|---|---|
| నల్లగొండ | 37 | 4,178 |
| సూర్యాపేట | 23 | 2,467 |
| యాదాద్రి | 17 | 826 |
| సిద్దిపేట | 4 | 149 |
| జనగాం | 12 | 810 |
| హన్మకొండ | 15 | 4,424 |
| వరంగల్ | 13 | 1,923 |
| మహబూబాబాద్ | 16 | 1,270 |
| భూపాలపల్లి | 7 | 264 |
| ములుగు | 9 | 572 |
| భద్రాద్రి | 23 | 1,809 |
| ఖమ్మం | 24 | 3,862 |
| మొత్తం | 200 | 22,554 |



హుజూర్‌నగర్ మైనార్టీ పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

## మైనార్టీ పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

హుజూర్‌నగర్, నవంబర్ 23 : హుజూర్‌నగర్ మైనార్టీ పాఠశాలను సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ శనివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంట గదిలోని సరుకులు, బియ్యం, కూరగాయలను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థాయికి చేరాలని సూచించారు. ఆయన వెంట ఆర్డీఓ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ తాసీల్దార్ నాగేందర్, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

## డిసెంబర్ 9వరకు సెర్ప్ స్పెషల్ డ్రైవ్

### మహిళా సంఘాల్లో కొత్త సభ్యుల చేర్పింపు

### విలేకరుల సమావేశంలో డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి

రామగిరి, నవంబర్ 23 : తెలంగాణ సంబురాలు సందర్భంగా సెర్ప్ ఆధ్వర్యంలో డిసెంబర్ 9వరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టి స్వయం సహాయక మహిళా సంఘాల్లో కొత్త సభ్యులను చేర్పించనున్నట్లు డీఆర్‌డీఓ వై.శేఖర్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని గ్రామీణాభివృద్ధి సంస్థలోని తన చాంబర్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటి వరకు సమభావన సంఘాల్లో చేరని మహిళలను 11,268 మందిని గుర్తించామన్నారు. వారందరినీ సంఘాల్లో చేర్చుతున్నామని తెలిపారు. ఈ డ్రైవ్ డిసెంబర్ 9వరకు కొనసాగుతుందని, ఇందులో కొత్త సభ్యులకు శిక్షణ, పొదుపు, రుణాలు, వాటి లాభాలను వివరించి చైతన్యం చేస్తామన్నారు. సంఘాల్లో చేరిన మహిళలకు ప్రభుత్వం ప్రమాద బీమా, రుణ బీమా అమలు చేస్తుందని తెలిపారు. దాంతో ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.పది లక్షలు, అంగవైకల్యం చెందితే రూ.5లక్షలు అందిస్తామని చెప్పారు. రుణ బీమాలో సభ్యులు మరణిస్తే లోన్ పూర్తిగా మాఫీ అవుతుందన్నారు. వీటితోపాటు వ్యవసాయానికి వంద శాతం రుణమాఫీ పథకాలు ఉన్నాయని తెలిపారు. ఇందిరా మహిళాశక్తికి పాడి పశువులు, పెరటి కోళ్ల పెంపకంపై ప్రోత్సహిస్తూ లోన్లు ఇస్తామన్నారు. మహిళా శక్తి క్యాంటీన్లను అన్ని పట్టణాల్లో ఏర్పాటు చేస్తుండగా, ఈ నెలలో జిల్లా కలెక్టరేట్‌లో నీలగిరి జిల్లా సమాఖ్య ద్వారా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్నామని చెప్పారు. నాలుగు ఎకరాల భూమి ఉంటే ప్రభుత్వం సోలార్ విద్యుత్ ప్లాంటు మంజూరు చేస్తుందన్నారు. అన్ని నియోజకవర్గాలు, గ్రామాల్లో డిసెంబర్ 1న పలు పనుల ప్రారంభోత్సవం ఉంటుందని తెలిపారు. డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో మంజూరైన వాటిని ఈ నెల 26న మంత్రి, ఎమ్మెల్యేలతో ప్రారంభోత్సవాలు చేస్తామన్నారు. గుర్తించిన ప్రాంతాల్లో ఈ నెల 26న పనులను ప్రారంభిస్తామన్నారు. డిసెంబర్‌లో జిల్లా కేంద్రంలో ముగింపు ఉత్సవాలు ఉంటాయని వెల్లడించారు.

## విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి
- కొండమల్లేపల్లిలో ఎస్సీ గురుకుల బాలికల పాఠశాల ఆకస్మిక తనిఖీ



ఎస్సీ గురుకుల పాఠశాలలో వంటల సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

కొండమల్లేపల్లి, నవంబర్ 23 : ఆశ్రమ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనం అందించాలని, పరిశుభ్రత, నాణ్యత పాటించకపోయినా, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినా చర్యలు తప్పవని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. మండల కేంద్రంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల, కళాశాలలో శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంట గది, స్టోర్ రూం, తరగతి గదులను పరిశీలించారు. బియ్యం, కూరగాయలకు సంబంధించిన వివరాలను అడిగి నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. వంట గదిలో కూరగాయల చెత్తను చూసి ఎందుకు తొలగించలేదని ప్రశ్నించారు. వంట వండే సిబ్బందికి పరిశుభ్రతపై పలు సూచనలు చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ గదిలో ఉపాధ్యాయుల రిజిస్టర్, స్టాక్, ఇండెంట్ రిజిస్టర్లను తనిఖీ చేసిన కలెక్టర్.. నిర్వహణ సక్రమంగా లేక పోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. 15 రోజులుగా పాఠశాలకు గుడ్ల సరఫరా లేక పోవడంతో ఇండెంట్ ఎందుకు పెట్టలేదని అడిగారు. గుడ్లు సరఫరా చేసే కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఆ తర్వాత బియ్యం నిల్వ ఉంచిన గదిని తనిఖీ చేసి సంబంధించిన వివరాలను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సరితను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల హాస్టళ్లలో చదివే విద్యార్థులకు పరిశుభ్రమైన, నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. ఆ తర్వాత ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విద్యార్థులతో ఆర్గానిక్ కెమిస్ట్రీ అంశానికి సంబంధించిన పలు ప్రశ్నలు అడిగి, కాసేపు వివరించారు. విద్యార్థులతో ముఖాముఖి అయిన కలెక్టర్ వారికి పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట తాసీల్దార్ మహ్మద్ అన్వర్, పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సరిత, సిబ్బంది పాల్గొన్నారు.

### పలు విద్యాలయాల పరిశీలన

దేవరకొండ రూరల్ : మండలంలోని మైనార్టీ రెసిడెన్షియల్ బాలుర కళాశాలను, ట్రైబల్ వెల్ఫేర్ కళాశాలను, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీలించారు. రోజూ మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పలు సబ్జెక్టులపై ప్రశ్నలు అడిగారు. పాఠశాల పరిసరాలు, వంట గది, స్టోర్‌రూం, డైనింగ్ హాల్ పరిశీలించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. భోజనం నాణ్యత విషయంలో రాజీ పడొద్దని సిబ్బందికి సూచించారు. అనంతరం ఎమ్మెల్యే బాలూనాయక్‌తో కలిసి నూతన ప్రభుత్వ ఆసుపత్రి భవనం కోసం శేరిపల్లి వద్ద స్థల పరిశీలన చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కుటుంబ సర్వే డాటా ఎంట్రీని పరిశీలించారు. ఆమె వెంట ఆర్డీఓ రమణారెడ్డి, తాసీల్దార్ సంతోష్‌కిరణ్ ఉన్నారు.

## తుక్కాపురంలో ఒడిశా ప్రజాప్రతినిధుల బృందం పర్యటన



తుక్కాపురంలో ఉపాధిహామీ కూలీలు, అధికారులతో ఒడిశా ప్రజాప్రతినిధుల బృందం

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 23 : మండలంలోని తుక్కాపురం గ్రామంలో ఒడిశా రాష్ట్ర ప్రజా ప్రతినిధుల బృందం సభ్యులు శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రా మంలో బృహత్ పల్లెప్రకృతి వనం, పల్లె ప్రకృతి వనం, నర్సరీల పెంపకం, ఎవెన్యూ ప్లాంటేషన్ విధానాలను పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో టీఎస్ఐఆర్డీ జేడీ అనిల్‌కుమార్, జడ్పీ సీఈఓ ఎన్.శోభారాణి, డీఆర్డీఓ నాగిరెడ్డి, అడిషనల్ డీఆర్డీఓ సురేశ్, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ దినాకర్‌గౌడ్, సెర్ప్ సంస్థ ప్రతినిధులు, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

## రైతులకు ఇస్తానన్న బోనస్ బోగసేనా?

- తిట్టడంలో ఉన్న శ్రద్ధ ఆరు పథకాల అమలులో లేదు
- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నార్కట్‌పల్లి, నవంబర్ 23 : రైతులకు సన్న వడ్లకు ఇస్తానన్న బోనస్.. బోగస్ మాటలా మారిందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులకు ప్రతిపక్షాలను తిట్టడంపై ఉన్న శ్రద్ధ ప్రజలకు ఇచ్చిన ఆరు పథకాల అమలులో లేదని విమర్శించారు. నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని తన నివాసంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొన్నారన్నారు. కరోనా సమయంలోనూ నాణ్యమైన ఎరువులు అందించి, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 72 గంటల్లో రైతుల ఎకౌంట్లలో నగదు జమ చేశారని గుర్తు చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు పథకాలను మరిచిపోయిందని విమర్శించారు. ప్రస్తుతం పౌరసరఫరాల శాఖ, రైస్ మిల్లర్ల మధ్య సమన్వయం లేక కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం తూకంలో జాప్యం జరుగుతుందన్నారు. ప్రభుత్వం 7లక్షల మెట్రిక్ టన్నులు కొంటామని చెప్పి లక్షా70వేలు మాత్రమే కొనుగోలు చేసిందని చెప్పారు. ధాన్యం, పత్తి కొనుగోళ్లలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. రైతు భరోసా ఇవ్వాలని, పంట రుణమాఫీ పూర్తి స్థాయిలో చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని, యాసంగి పంట వేయాలా.. వద్దా? అనే అయోమయ స్థితిలో రైతులు ఉన్నారని తెలిపారు. మూసీ సుందరీకరణ అంటూ హైడ్రా హడావుడి చేయడం తప్ప ప్రజలకు చేసిన మేలు ఏమీలేదన్నారు. లక్షా యాభై వేల కోట్లతో మూసీ సుందరీకణ చేయడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు యానాల అశోక్‌రెడ్డి, బైరెడ్డి కరుణాకర్‌రెడ్డి, మేకల రాజిరెడ్డి, కొండూరి శంకర్, దోసపాటి విష్ణుమూర్తి, శ్రీధర్, ఉపేందర్, నర్సింహ, సైదులు, వాజిద్, నాగరాజు, జానీ పాల్గొన్నారు.



ఎంజీయూలో వివిధ హోదాల్లో నియామకమైన వారిని అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

## ఎంజీయూలో వివిధ విభాగాలకు నూతన అధికారుల నియామకం

### ఉత్తర్వులు అందజేసి అభినందించిన వీసీ హుస్సేన్, రిజిస్ట్రార్ రవి

రామగిరి, నవంబర్ 23 : మహాత్మాగాంధీ యూనివర్సిటీలో వివిధ విభాగాలకు నూతన అధికారులను నియమిస్తూ శనివారం వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ అల్వాల రవి ఉత్తర్వులు జారీ చేశారు. వారికి వీసీ తాన చాంబర్‌లో రిజిస్ట్రార్‌తో కలిసి ఉత్తర్వులు అందజేసి అభినందించారు. బాధ్యతాయుతంగా పనిచేసి యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

### వివిధ హోదాల్లో నియమితులైన వారు..

వర్సిటీ మౌలిక వసతుల కల్పన డైరెక్టర్‌గా ఆకుల రవి, స్టూడెంట్ ఎఫైర్స్ డైరెక్టర్‌గా శ్రీదేవి, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్‌గా అన్నపూర్ణ ఆర్ఎస్ బుట్టి, స్కిల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్‌గా తిరుమల, యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్‌గా చింత శ్యాంసుందర్‌ను నియమించారు. వారికి సహచార అధ్యాపకులు, బోధన, బోధనేతర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.